క్లుప్తంగా

చెత్త కార్మికులకే అందజేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 3వ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ఆ ప్రాంతంలో జరిగిన ప్యాచ్ వర్క్‌ను పరిశీలించారు. అనంతరం బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌కు వెళ్లి అల్పాహారాన్ని పరిశీలించారు. నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం



తెనాలిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని విద్యుత్ స్తంభం ధ్వంసమైన సంఘటన స్థానిక కొత్తపేటలోని రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ దుర్గారావు కథనం మేరకు.. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం కరెంటు స్తంభాన్ని ఢీకొట్టినట్లు చెప్పారు. ప్రమాదంలో స్తంభం పూర్తిగా ధ్వంసం కాగా, స్థానికుల సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకుని మరమ్మతులు చేపట్టి నూతన స్తంభం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పరిసరాల్లోని విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్వరితగతిన పని పూర్తి చేసినట్లు వివరించారు.

పీఎల్‌వీలకు శిక్షణ



తెనాలిరూరల్: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నియమించిన పారా లీగల్ వలంటీర్(పీఎల్‌వీ)లకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం. ఇందిరాప్రియదర్శిని మాట్లాడారు. పీఎల్‌వీలు న్యాయసేవాధికార సంస్థకు, ప్రజలకు వారధి లాంటి వారని చెప్పారు. అవసరమైన వారికి న్యాయ సలహాలు సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌లు ఎన్‌వీ మహేశ్వరరావు, ప్రభావతి, శారద, ఖాదర్ హుస్సేన్ వివిధ చట్టాల గురించి వివరించారు. మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్ పర్యవేక్షించారు.

డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు అవార్డు



డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం

తెనాలి: కెనడా దేశానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏటా అందిస్తున్న 'షారోన్ స్మారక అంతర్జాతీయ సేవ అవార్డ్' 2025 సంవత్సరానికి ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు ప్రదానం చేయనున్నారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి శనివారం సాయంత్రం రూరల్ మండల గ్రామం పెదరావూరులోని సంస్థ కార్యాలయంలో వివరాలను తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా ఎన్నో క్లిష్టతరమైన ఆపరేషన్లను చేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారని తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవాసంస్థ తరపున ప్రతిభావంతులైన సేవానిరతిగల ప్రముఖులను జ్యూరీ ఎంపిక చేసి ప్రతిఏడాది 'షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు'తో సత్కరిస్తోందని ప్రదీప్ తెలిపారు. ఇంతకు ముందు డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ డి.శారద, చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ యశోధరకుఈ అవార్డును బహూకరించామని గుర్తుచేశారు. త్వరలో తెనాలిలో ఏర్పాటుచేసే ప్రత్యేక సభలో డాక్టర్ సుబ్రహ్మణ్యంకు అవార్డును ప్రదానం చేస్తామని వివరించారు.

ఉద్యోగ సంఘం నేతల హర్షం

దుగ్గిరాల: జీపీఎఫ్ నిదులు విడుదల చేయటంపై ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల నాయకులు అందె బాల చంద్రమౌళి సీఎం చంద్ర బాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.7,300 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఎంపీపీ జబీన్, ఎంపీడీఓ శ్రీనివాస రావు, జి.పూర్ణప్రసాద్,మురళీకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలు మీకు పట్టవా?

- కౌన్సిలర్లకు కనీస గౌరవం కూడా ఇవ్వరా!
- బిల్లుల ఏర్పాటులో జాప్యం ఎందుకు?
- ఇంజినీరింగ్ అధికారులను నిలదీసిన అన్ని పార్టీల కౌన్సిలర్లు
- వాడీవేడిగా సాగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



అధికారుల తీరుకు నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

తెనాలిఅర్బన్: మున్సిపల్ నియమావళికి అనుగుణంగా తెనాలి అధికారులు పనిచేయటం లేదు. కనీసం కౌన్సిలర్‌లకు వార్డులలో జరిగే అభివృద్ధి పనుల వివరాలు తెలియజేయకపోగా వారిని కనీసం ప్రారంభోత్సవాలకు పిలవకుండా అమర్యాదగా వ్యహరిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదంటూ వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీల కౌన్సిలర్‌లు అధికారులపై ధ్వజమెత్తారు. పద్ధతి మార్చుకోవాలని లేని పక్షంలో కౌన్సిల్‌కు ఉన్న విస్తృత అధికారాలతో వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాన్ని శనివారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. మొదటి అంశం చదవటం పూర్తికాగానే బుర్రిపాలెం రోడ్డులోని రైతు బజారు వద్ద నూతనంగా నిర్మించే తాత్కాలిక షాపుల కోసం రూ.32 లక్షలు ఎందుకని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వర రావులు ప్రశ్నించారు. వెంటనే పనిని రద్దు చేయాలని కోరారు. పరిశీలిస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. పట్టణంలో జరిగే ప్రతి చిన్న అభివృద్ధి పనిపై కౌన్సిలర్‌లకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని దానిని అమలు చేయాలని చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ బండి శేషన్నలు అధికారులను ఆదేశించారు. మరోసారి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై ఆగ్రహం

ఇంజినీరింగ్ విభాగంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతుందని, అభివృద్ధి పనులు పూర్తి అయి నెలలు దాటుతున్న నేటికీ బిల్లులు కూడా రూపొందించక లేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ముందుకు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కనీసం కంప్యూటర్‌లో బిల్లులు చేసే ఉద్యోగి కూడా లేకపోవటం విచారకరమని చెప్పారు.



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ శేషన్న



చైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన కౌన్సిలర్లు

సుదీర్ఘంగా జరిగిన చర్చలో అధికారులు సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఇప్పటి నుంచి అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను నిబంధలకు అనుగుణంగా సకాలంలో పెట్టి ఆమోదిస్తామని ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. అలాగే కౌన్సిలర్ హక్కులను కాపాడేందుకు వీలుగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, పనిచేయని అధికారులపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకునే హ క్కును అమలు చేయాలని కోరుతూ అన్ని పార్టీల కౌన్సిలర్లు సంతకాలు చేసిన వినతి పత్రాలను చైర్‌పర్సన్ రాధికకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

పూలే కాలనీలో మంచి నీటి సమస్య అధికంగా ఉందని, దానిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని 11వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి కోరారు. వచ్చేనెలలో పైపులైన్ పనులు ప్రారంభించి త్వరగా పనులు పూర్తి చేయిస్తామని కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. అలాగే 27వ వార్డు పరిధిలోని డొంక రోడ్డులో మంచినీటి సమస్య ఉందని, దానిని పరిష్కరించాలని టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ కోరారు.

పాత పైప్‌లైన్ పాడైపోయిందని, కొత్తపైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏఈ సునీల్ తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లోని పలు రోడ్లలో పాచ్ వర్కులు చేయాలని 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి కోరారు. టెండర్లు పిలచి పనులు ప్రారంభిస్తామని ఏఈ సూరిబాబు తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్‌లు, కోఅప్షన్ సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెనాలిలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు



పోటీలను ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిరూరల్: తెనాలి, వేమూరు నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, పశు పాల, వ్యవసాయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిధులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడు తూ ఎడ్ల పరదర్శనలు తెలుగు సంస్కృతిలో భాగమని చెప్పారు. ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పరుచూరి అశోక్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. పోటీల కన్వీనర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పర్యవేక్షించారు.

చట్టానికి అందరూ సమానులే



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని

తెనాలిరూరల్: చట్టానికి అందరూ సమానులేనని, బాలలకు రాజ్యాంగం, చట్టం కల్పిస్తున్న ప్రత్యేక హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం. ఇందిరాప్రియదర్శిని అన్నారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో యాక్టు)పై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందివెలుగులో న్యాయవిజ్ఞాన సస్సును శనివారం సాయంత్రం నిర్వహించారు. న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడినా, ప్రేరేపించే పనులు చేసినా, అసభ్యంగా ప్రవర్తించినా, తాకినా పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులను నిరోధించేందుకు 2012లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని, వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, కోఆర్డినేటర్ యర్రంశెట్టి అనిల్‌కుమార్, ఎంపీటీసీ టి. విజయలక్ష్మి, నాగళ్ల హరీష్, శ్రీనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నియంత్రణ

తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్.రమాదేవి



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ రమాదేవి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వలన వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్.రమాదేవి పేర్కొన్నారు. ఆర్య సమాజాన్ని స్థాపించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా గాంధీచౌక్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు అనేక మంది దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఓంకార ప్రసాద్, ఆర్య సమాజం అధ్యక్షురాలు కృష్ణకుమారి, కార్యదర్శి కోటేశ్వరరావు, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి టోపీలు–మాస్కులు వితరణ



ట్రాఫిక్ పోలీసులకు వస్తువులు అందజేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ మొవ్వా విజయలక్ష్మీ స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం తెనాలిలోని ట్రాఫిక్ విధుల్లో ఉండే 20 మంది పోలీస్ సిబ్బందికి వివిధ వస్తువులను అందజేశారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులకు అవసరమైన చలువ కళ్లద్దాలు, కూలింగ్ వాటర్ బాటిల్స్, టోపీలు, సర్జికల్ మాస్కులను పంపిణీ చేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ తరపున వితరణను ఆయన చేతులమీదుగా ట్రాఫిక్ సిబ్బందికి బహూకరించారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మొవ్వా సత్యనారాయణ సమాజానికి చేస్తున్న సేవలను అభినందించారు. పలు సేవల్లో తాను స్వయంగా పాల్గొన్నానని చెబుతూ, ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కోసం అందించిన సహకారంపై సంతోషం వ్యక్తంచేశారు. సేవాసమితి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ మాట్లాడుతూ మండుటెండలో పనిచేసే ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి తమ వంతు బాధ్యతగా సహకారం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ బ్రహ్మయ్య, ట్రాఫిక్ పోలీసులు, అతిథులు మొవ్వా రఘుబాబు, కొరటాల జ్ఞానేంద్రప్రసాద్, ఈశ్వర్ చంద్, కోటయ్య, చలమయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమేష్ చంద్రకు ఘన నివాళి



ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

తెనాలిరూరల్: విధి నిర్వహణలో అశువులు బాసిన ఐపీఎస్ అధికారి స్వర్గీయ చదలవాడ ఉమేష్‌చంద్ర జయంతిని పురస్కరించుకొని తెనాలి సబ్‌డివిజన్ పోలీసులు శనివారం ఘన నివాళి అర్పించారు. చెంచుపేటలోని రావి అమ్మయ్య చౌక్‌లో ఉన్న ఉమేష్ చంద్ర విగ్రహానికి అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, పోలీసు అధికారులు సిబ్బంది పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం డీజీ మాట్లాడుతూ ప్రజలకు ఉమేష్‌చంద్ర చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యదీక్ష, పట్టుదల కలిగిన వ్యక్తి ఉమేష్‌చంద్ర అన్నారు. లక్ష్యం మంచిదయితే లోకానికి ఉపయోగపడుతుందని నమ్మిన వ్యక్తని చెప్పారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఉమేష్‌చంద్ర ఆశయాలను కొనసాగించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీసుల పనితీరు ఇలా కూడా ఉంటుందా అని ఉమేష్‌చంద్ర చేసి చూపించారని కొనియాడారు. విధి నిర్వహణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడేది పోలీసు శాఖ అన్నారు. పోలీస్ శాఖకే వన్నె తెచ్చిన ఉమేష్ చంద్రను గుర్తు చేసుకోవడం ప్రతి పోలీసు ఉద్యోగి బాధ్యతగా చెప్పారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు రాముల నాయక్, ఎస్.రమేష్‌బాబు, త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశరావు, రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్, ఉమేష్‌చంద్ర బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నదానం..


ఉమేష్ చంద్ర జయంతిని పురస్కరించుకుని ఆయన తండ్రి చదలవాడ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద శివలింగేశ్వర భక్త బృందం సహకారంతో పేదలకు, అలానే వేంకటేశ్వర యోగ కేంద్రం ఆధ్వర్యంలో షిరిడీ సాయి వృద్ధాశ్రమం, శ్రీ మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన చేసి పండ్లు పంపిణీ చేశారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కేవలం ఎస్సీ కమిషన్‌ను మాలలకే కేటాయించారని, ఇప్పటికైనా మాదిగ సామాజిక వర్గానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి చేపట్టడానికి మాదిగలు అర్హులు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నడిపిన చరిత్ర ఎమ్మార్పీఎస్ అని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

రహదారి పనులు వేగవంతం చేయండి

ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర: మండల పరిధిలోని ప్రధాన రహదారుల మరమ్మతులు, వివిధ రంగాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను అధికారులు, కాంట్రాక్టర్‌లు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈవోపీఆర్డీ భార్గవ్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఏఈ నరసింహారావు మాట్లాడుతూ నందివెలుగు నుండి కొల్లిపర వరకు వచ్చే రోడ్డు, అత్తోట నుండి దంతలూరు, కుంచవరం రోడ్డు ప్యాచ్ వర్కులు మొదలుపెట్టినట్లు తెలిపారు. అదే విధంగా మున్నంగి నుండి దుగ్గిరాల రోడ్డు నిర్మాణం కొరకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు మాట్లాడుతూ రైతులకు సీజనల్ పంటల సాగులో ఎటువంటి మెళకువలు తీసుకువాలనే అంశాలను వివరించారు. ఏపీఎం పి. రమాదేవి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రైతులు పంట రుణాలు ఏ విధంగా పొందాలి, వాటిని ఏ విధంగా చెల్లించాలి అనే అంశాలను వివరించారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదించారు. సమావేశంలో మండల పరిషత్ ఉప-అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, కొల్లిపర మండల పరిషత్ ఏవో ప్రతాపరెడ్డి, తహశీల్దార్ కార్యాలయ డీటీ రాజేష్, కొల్లిపర మెడికల్ అధికారి డాక్టర్ బి.భారత్, మున్నంగి పీహెచ్‌సీ డాక్టర్ సుబ్బారావు, ఎంఈవో ఝాన్సీలత, ఏఈ పీఆర్ సాంబిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సుధాకర్, ఎలక్ట్రికల్ ఏఈ, పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి ఉగాది పురస్కారం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో నివాసముండే బీఎస్ఎన్ఎన్ విశ్రాంత ఉద్యోగికి ఉగాది పురస్కారాలలో భాగంగా ఘనంగా సన్మానించారు. శనివారం పలువురు ఉద్యోగస్తులకు ఆయనకు అభినందనలు తెలియజేశారు. విజయవాడ గాంధీ నగర్‌లో ఉగాది పండుగ సందర్భంగా విజయశ్రీ సాంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండవల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి మున్నంగి జస్వంత్ రెడ్డి, సరోజని దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షులు బండారు నరసింహారావు మాట్లాడుతూ జస్వంత్‌రెడ్డి సేవలను గుర్తించి ఉగాది పండుగ సందర్భంగా ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ సాంస్కృతి సేవ సంస్థ నిర్వాహకులు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో బాలాజీ చికెన్ సెంటర్ గరిక బాలాజీ జ్ఞాపకార్థం కుమారులు గరిక దుర్గారావు, సూరిబాబు, గోపి మజ్జిగ చలివేంద్ర శనివారం ఏర్పాటు చేశారు. ఏడేళ్ల నుంచి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జెండా చెట్టు సెంటర్లో శనివారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో మహ్మద్ అలీ పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని మసీదును పరిశీలించారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు సభ్యులు షేక్.జహంగీర్, రబ్బానీ, సుబానీ, గ్రామ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

విశ్వావసు పంచాంగ ఆవిష్కరణ

కొల్లిపర: ఉగాది పండుగ పురస్కరించుకొని స్థానిక బ్రహ్మ ఐక్యవేదిక భవనంలో శనివారం మండలంలోని బ్రాహ్మణులు పంచాంగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ రేపు ఉదయం మండలంలోని 20 గ్రామాలలో పలు దేవాలయాలలో ఉదయం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాంగం శ్రవణం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ ఆవిష్కరణలో మండలంలోని వివిధ బ్రాహ్మణులు వేద పండితులు పాల్గొన్నారు

ఏప్రిల్ 13 నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఏప్రిల్ 13,14,15 తేదీల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నటులపాస్టర్ సిహెచ్ నతానియేల్ తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరి మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి ఏడు గంటలకు కూడికలు జరుగుతాయని చెప్పారు. విజయవాడకు చెందిన అంతర్జాతీయ ప్రసంగికులు రెవరెండ్ డేవిడ్ బ్రెన్‌హం వాక్యపరిచర్య చేస్తారని పేర్కొన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

తెనాలిటౌన్: విద్యుత్ బిల్లులును సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని విద్యుత్ ఈఈ వి.వి.చిరంజీవి సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బిల్లులు చెల్లించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30వ తేదీ ఉగాది, 31 రంజాన్ పర్వదినాలు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించినట్లు వివరించారు. వినియోగదారులు ఆన్‌లైన్ విధానంలోగానీ, ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలియజేశారు.

ఉగాది శుభాకాంక్షలు

మంగళగిరి: మంగళగిరి ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శనివారం ఉగాది, రంజాన్ పండగల శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సారాది ఉగాది షడ్రచులతో మనిషి జీవితాన్ని తెలియజేస్తుందన్నారు. ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో చేసి తమ పవిత్రతను తెలియజేస్తుందన్నారు. తెలుగు వారంతా ఉగాది, రంజాన్ పండగలను సంతోషంగా ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మహంకాళీ దేవస్థానంలో చండీ హోమం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శనివారం చండీ హోమం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా కోనేరు కుటుంబరావు, హిమబిందు దంపతులు, వేగే జయ కృష్ణ దంపతులు హోమంలో పాల్గొన్నారు. భక్తులకు ఏర్పాట్లను దేవస్థాన ఈఓ కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

క్రెడిట్ క్యాంపునకు విశేష స్పందన

దుగ్గిరాల: కార్పొరేషన్ రుణాలకు భారీగా లబ్ధిదారులు హాజరయ్యారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ. ఎ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. క్యాంపునకు 350 మంది లబ్ధిదారులు హాజరయ్యారని, మొత్తం 90 యూనిట్లు ఉన్నాయని చెప్పారు. బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు, ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద ఉన్న పాత రైల్వే క్వార్టర్స్‌లో గుర్తుతెలియన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి తాడుకు వేళాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని కిందకు దింపి, పరిశీలించారు. అప్పటికే ఆ మృతదేహం కుళ్లిపోయి ఉంది. బట్టలు సైతం నీరు కారడంతో గుర్తించడం చాలా కష్టంగా ఉందని, మృతి చెంది రెండు మూడు వారాలు అయ్యి ఉండవచ్చని ఆయన తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసుల విషయాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.